క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న పలు పార్టీల నాయకులు

నక్కపల్లి: ఉద్దండపురంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో ఆంజనేయ హోమాలు, తమలపాకు పూజలు, వ్రతాలు నిర్వహించారు. ప్రత్యేక భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించి అలరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా బృందాల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, పాడగట్ల పాపారావు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జీసీఆర్ ఫౌండేషన్ అధినేత గెడ్డం బుజ్జి, సర్పంచ్ పాడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, ఆలయ కమిటీ చైర్మన్ పాడగట్ల రమణ, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ వింగ్ అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు లాలం కోడూరు తీర్థం



లాలం ఎరికిరెడ్డినాయుడు, ఆదమ్మ దంపతులు

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో లాలం కోడూరు గ్రామంలో లాలం ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మ దంపతుల తీర్థం బుధవారం జరగనుంది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలో ఈ తీర్థంను లాలం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, వాలీబాల్ పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: వాహన చోదకులు తమ రికార్డులను వెంట ఉంచుకోవాలని ఏఎస్ఐలు రామకృష్ణ, దొర సూచించారు. మునగపాక మెయిన్ రోడ్డులో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు.

25న సర్వసభ్య సమావేశం

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

వీఆర్‌వోల డైరీ ఆవిష్కరణ




డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, తదితరులు

అచ్యుతాపురం: మండలంలోని వీఆర్‌వోల 2025 డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. అనకాపల్లి రెవెన్యూ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీ అందరికీ ఉపయోగకరంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు శశిధర్, సింహాచలం నాయుడు, వెంకటరావు, శ్రీనివాస్, చినప్పారావు పాల్గొన్నారు.



అన్నవరంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



వినియోగంలో లేని కుండీలు

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనం
- **గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంచాయతీలకు మెరుగైన ఆదాయం**

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. మరోవైపు గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు విధులకు దూరమయ్యారు. చెత్త సేకరణకు పంచాయతీలకు కేటాయించిన రిక్షాలు తుప్పు పడుతున్నాయి. ప్రతి గ్రామం చెత్త రహితంగా ఉండాలనే **ఆశయంతో మాజీ సీఎం వైఎస్ జగన్ సంపద కేంద్రాల నిర్మాణాలకు గత ఐదేళ్లలో ఎంతో ప్రాధాన్యత కల్పించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సంపద తయారీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**

సంపద లేని చెత్త కేంద్రాలు

కోటవురట్ల: సంపద సృష్టిస్తా.. ఈ పదం వినపడగానే టక్కున గుర్తుకు వచ్చే వ్యక్తి సీఎం చంద్రబాబే.. ఈ మాట ఆయన ట్రేడ్ మార్కుగా గుర్తింపు పొందింది. ఎక్కడ పది మంది కనిపించినా ఆయన నోట సంపద సృష్టిస్తా అన్న పదం అనాలోచితంగా వచ్చేస్తుంది. ఇందులోంచి పుట్టుకొచ్చిందే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం. టీడీపీ ప్రభుత్వంలోనే ఈ పథకం రూపొందగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రతి గ్రామం చెత్త రహితంగా స్వచ్ఛ గ్రామంగా ఉండాలనే ఆశయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంపద కేంద్రాల నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పించారు. ఇందులో భాగంగా మండలంలోని 25 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఒక్కొక్క సంపద తయారీ కేంద్రాన్ని సుమారు రూ.4.68 లక్షలతో నిర్మించారు. ఊరికి చివరన షెడ్, తడి, పొడి చెత్తలు వేర్వేరుగా వేసేందుకు వీలుగా కుండీలు నిర్మించారు. ఆహ్లాద వాతావరణం ఏర్పడేలా షెడ్‌పై రంగులతో చిత్రాలు వేయించారు. కొన్ని చోట్ల అరటి మొక్కలు, కూరగాయల పెంపకం కూడా చేపట్టారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి తిరిగి రైతులకు తక్కువ ధరకే విక్రయించేవారు. తద్వారా



చౌడువాడలో రహదారిలో చెత్త

రైతుకు తక్కువ ధరకే సేంద్రియ ఎరువు లభ్యం కావడమే కాకుండా పంచాయతీలకు ఆదాయం లభించేది. ప్రధానంగా గ్రామంలోని చెత్తను ఎప్పటికప్పుడు సంపద తయారీ కేంద్రాలకు తరలించడం ద్వారా ఆరోగ్యకర వాతావరణం ఏర్పడేది. వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛ గ్రామాలు తయారయ్యేవి. ఇదంతా గతం.. ప్రస్తుతం ఈ షెడ్లు అన్నీ ఎందుకూ కొరగాకుండా మిగిలిపోయాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో సంపద తయారీ కేంద్రాలు సుమారు 160 వరకు ఉండగా.. ఇవన్నీ మూలకు చేరాయి. పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం లేదు. చెత్తను సేకరించే గ్రీన్ అంబాషిడర్లకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో విధులకు దూరం అయ్యారు. దాంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నీ అలంకార ప్రాయంగానే ఉన్నాయి. చెత్తను తరలించేందుకు అందించిన స్వచ్ఛ రిక్షాలు మూలకు చేరి తుప్పు పడుతున్నాయి. ఘన వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే కాకుండా ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నీరుగారింది. జిల్లా అధికారులు రావడం, సంపద తయారీ కేంద్రాలను పరిశీలించడం, ఆదేశాలు ఇవ్వడం వరకే తంతుగా మారింది. ఆచరణ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. సంపద సృష్టి ఎలా ఉన్నా ముందు పారిశుధ్యం మెరుగుకు సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి. దీని వల్ల పారిశుధ్యం మెరుగుపడడమే కాకుండా రైతులకు సేంద్రియ ఎరువు కొరత తీరుతుంది. గతంలో వీటి నిర్వహణ సక్రమంగా ఉండేది. గ్రీన్ అంబాషిడర్లకు వేతనాలు అందించి మళ్లీ సంపద కేంద్రాలకు వెలుగు తీసుకురావాలి.

– పైల శివరామ్, సర్పంచ్, చినబొడ్డేపల్లి

దుర్వినియోగమైన నిధులు



పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఓ లక్ష్యం కోసం నిర్మించిన షెడ్లు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

– జి.నానిబాబు, రైతు, యండపల్లి

సచివాలయాల తనిఖీ



ఉపమాక సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో పలు సచివాలయాలను ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయంలో అందిస్తున్న సేవలు, ఎంఎస్ఎంఈ సర్వే, సిటిజన్స్ వర్క్స్, పీఎం ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్, ఈ సర్వీసెస్ పేమెంట్ రిమిటెన్స్, సిబ్బంది హాజరు వంటి వాటిపై సమీక్ష చేశామని ఎంపీడీవో తెలిపారు. సచివాలయంలో పౌర సేవలు సక్రమంగా అందించాలని, ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పల్లె పండగ కింద చేపట్టిన పనులను కూడా పరిశీలించారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ



చినదొడ్డిగల్లులో పింఛన్లు తనిఖీ చేస్తున్న డాక్టర్ల బృందం

నక్కపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లను విశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక డాక్టర్ల బృందం సోమవారం తనిఖీ చేసింది. వివిధ గ్రామాల్లో అందుకుంటున్న పింఛన్ల దారుల ఇళ్లకు డాక్టర్లు నేరుగా వెళ్లి పరిశీలన చేశారు. దివ్యాంగుల పింఛన్లు కొంత మంది అనర్హులకు అందుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తోంది. మంగళవారం రాజయ్యపేట, చినదొడ్డిగల్లు, నక్కపల్లి, గుల్లిపాడు, ఉపమాక, పెదతీనార్ల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఈ లబ్ధిదారుల వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ వైఖరిని పలువురు తప్పుపడుతున్నారు.

ఉమ్మలాడ గౌరీ సంఘం అధ్యక్షుడిగా శివాజీ



ఉమ్మలాడ గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ గౌరీ సేవా సంఘం కార్యవర్గ సభ్యుల ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా సూరిశెట్టి శివాజీ, కార్యదర్శిగా శరగడం గణేష్, కోశాధికారిగా కాండ్రేగుల శివాజీ, ఆలయ ధర్మకర్తగా రాపేటి జగ్గారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ గౌరీ సేవా సంఘంఅభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, ఆడారి నూకునాయుడు, మొల్లేటి నారాయణరావు, సూర్యప్రకాష్, తాతునాయుడు, రామప్పారావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో ఉపాధి పనుల్లో అవకతవకలు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమాదేవి

ఎస్.రాయవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో దిగువ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో రూ.16,78,97,000 వెచ్చించి 1862 పనులు చేసిన వాటిపై చేపట్టిన సోషల్ ఆడిట్ నివేదిక ప్రకారం ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల మస్తరు వేయడంలో కొట్టివేతలు, చేసిన పనులు కొలతలు తీసే సిబ్బంది తప్పుతడకలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు సిబ్బంది చేసిన అవకతవకలకు సంబంధించి రూ.24,500 రికవరీ చేయాలని ఆదేశించారు. పనులు చేసేటప్పుడు సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఇకపై సహించేదిలేదని హెచ్చరించారు. ఈ నివేదికలో కూలీలకు వేతనాలు రూపంలో రూ.14.87 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.58 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తిస్తే ఎంతో మేలు

కె.కోటపాడు : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం సమస్య బారిన పడకుండా మందుల ద్వారా కాపాడవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల పాడుగుపాలెం, వారాడ గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టువ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి శరీరంపై రాగి రంగు మచ్చలతో పాటు స్పర్శలేని మచ్చలు ఉంటే వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. తద్వారా వీరికి ఎండీటీ మాత్రలను అందించడం ద్వారా వ్యాధి నుంచి ఇతరత్రా సమస్యలు రాకుండా చూడడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ఫిబ్రవరి 2 వరకూ నిర్వహించాలని తెలిపారు.

రిమాండ్ ఖైదీలకు న్యాయ సహాయం



సబ్ జైల్ పర్యవేక్షకుడ్ని రిమాండ్ ఖైదీల వివరాలు అడుగుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

యలమంచిలి రూరల్: స్థానిక సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ మంగళవారం తనిఖీ చేశారు. నెలలో ఒకసారి జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్ జైళ్లను తనిఖీ చేసి రిమాండ్‌లో ఉన్న ఖైదీల సంక్షేమం, బెయిల్ పురోగతి, వారికి అందిస్తున్న ఆహారం, తదితర విషయాలపై పరిశీలన చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ఉప కారాగారం పర్యవేక్షకుడు ప్రసాద్‌ను రిమాండ్‌లో ఉన్న ఖైదీలు ఏయే నేరాభియోగాలను ఎదుర్కొంటున్నదీ అడిగి తెలుసుకున్నారు. అవసరమైన రిమాండ్ ఖైదీలకు న్యాయ సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, విజిటింగ్ పీపీ రమణ, ప్యానల్ న్యాయవాది బి.హరిశంకర్రావు పాల్గొన్నారు.

అంకిత భావంతోనే గుర్తింపు



భవానిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులు ఎక్కడికి బదిలీపై వెళ్లినా ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్ అన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలలో ఐదేళ్ల పాటు పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఆఫీస్ సబార్డినేటర్ భవానిని ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, విజయ్‌కుమారి, అరుణ, విమలాదేవి, విజయ్‌కుమారి, కరుణ, కృష్ణవేణి, దీపిక, ఆర్.అప్పలనాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు



కాగితలో రైతులకు అపరాల సాగులో జాగ్రత్తలు తెలియజేస్తున్న ఏవో ఉమాప్రసాద్



అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న పాయకరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ

నక్కపల్లి: మండలంలో సుమారు 950 ఎకరాల్లో అపరాలు సాగు అవుతుందని వ్యవసాయాధికారి ఉమప్రసాద్ తెలిపారు. మంగళవారం కాగిత, వేంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన క్షేత్ర పర్యటన చేశారు. రైతులకు అపరాలల్లో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఎకరాకు పసుపు రంగు జిగురు అట్టలు 10 నుంచి 15 వరకు పొలంలో కట్టడం ద్వారా రసం పీల్చు పురుగులు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. తొలి 20 రోజుల లోపు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున వేప నూనె పిచికారీ చేస్తే చీడపీడలు పొలంలోకి రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. 15 నుంచి 20 రోజుల మధ్యలో కలుపు రెండు నుంచి మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపిర్ మందు ఎకరానికి 200 మిల్లీలీటర్లు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. ఈ సమయంలో నేలలో కొద్దిగా తేమ ఉండాలన్నారు. పేనుబంక లేదా తామర పురుగులు ఆశించినప్పుడు ఆకులు ముడతలు పడి కనిపిస్తాయని, నివారణకు ఎసిఫేట్ పొడి మందు ఎకరాకు 300 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ మందు 360 మిలీ పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంట్రినిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ ఎకరాకు 60 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు లేదా తుప్ప తెగులు ఆశించినప్పుడు లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పన మాంకోజెబ్ లేదా 2 మిల్లీ లీటర్ల చొప్పున హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయడం ద్వారా నియంత్రించుకోవచ్చునన్నారు. పంట చివరి దశలో నీటి ఎద్దడి ఉంటే ఎకరాకు ఒక కిలో పొటాషియం నైట్రేట్ పిందె దశలో పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చునని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసే రైతులు ఆర్ఎస్‌కేల ద్వారా చేసి కనీస మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన చేసి, రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మాగాణులో అపరాలు సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గుప్తా, వీహెచ్ఏ రూప, వీఏఏ కల్పన, రైతులు పాల్గొన్నారు.

మేలుజాతి పశువులతో మంచి ఆదాయం



మాట్లాడుతున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: మేలుజాతి పశువులను కొనుగోలు చేసుకోవాలని, తద్వారా మంచి ఆదాయం సమకూరుతుందని మునగపాక మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో భాగంగా ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సార కలిగిన పశువులను ఎంచుకోవాలన్నారు. పశు దాణా విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తేలికపాటి జీర్ణమయ్యే పోషకాహారాన్ని అందించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, రైతులు మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ రాంబాబు, నూకప్పారావు, శేషు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడిక తొలగింపుపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవికి ముందే తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలపై దృష్టి చూపాలన్నారు. ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు అమలు



యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై చర్చిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

యలమంచిలి రూరల్: పరవాడ సబ్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ యలమంచిలి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండ్రోజుల క్రితం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పట్టణ పోలీస్ స్టేషన్‌లో లాకప్ గదులు, పరిసరాలు, రికార్డు గదులను పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, సమస్యలపై ఆరా తీశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రద్దీ కూడళ్లను స్వయంగా వెళ్లి పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు కె.సావిత్రి, ఎం.ఉపేంద్ర, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రద్దుకు కూటమి కుట్రలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: జగనన్న మార్క్ కనిపించకుండా ఆయన అమలు చేసిన పథకాలు రద్దు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆరోపించారు. మంగళవారం ఆయన ఉద్దండపురంలో ఆంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న మార్క్ కొనసాగుతుందనే భయంతోనే అమ్మ ఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు ఇప్పటివరకూ అమలు చేయలేదన్నారు. తాజాగా ఆరోగ్యశ్రీ రద్దుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అతీగతీ లేదన్నారు. పింఛన్లు రద్దు చేసేందుకు తనిఖీలు చేపట్టారన్నారు. కొత్తవి ఇవ్వక పోగా పాత పింఛన్లు రద్దు చేయడం దారుణమన్నారు. జల్సా కోసమే దావోస్‌లో తండ్రీ కొడుకులు పర్యటిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా తప్ప ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఆరు మాసాల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకం వచ్చిందన్నారు. జగనన్న విలువ ఇప్పుడు ప్రజలకు తెలిసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నర్సింహమూర్తి, పాపారావు, మణిరాజు, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.